క్లుప్తంగా

23న ఉత్తరద్వార దర్శనం

శాయంపేట : మండల కేంద్రంలోని శివమార్కండేయ, శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ సముదాయాల్లో ఈనెల 23వ తేదీన వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని ఉత్తర ద్వార దర్శనం ఉంటుందని ఆలయ కమిటీ చైర్మన్ బాసాని సూర్యప్రకాష్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 5 గంటలకు గోదా రంగ నాయకులస్వామి పూజ తిరుప్పావై పారాయణం అస్టోత్తర పుష్పాలపూజ, మంగళ హారతి, ఉత్తర ద్వార దర్శనం, ప్రత్యేక పూజలు, ప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు.

దరఖాస్తుల ఆహ్వానం

దామెర: మండలంలోని ఒగ్లాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు బుధవారం ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి గాను అర్హులైన విద్యార్థులు వచ్చే ఏడాది జనవరి 6వ తేదీలోగా రూ.100 చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కాగా వీరికి ఫిబ్రవరి 11వ తేదీన ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

మంత్రిని కలిసిన కాంగ్రెస్ నాయకుడు



ఆత్మకూరు : రాష్ట్ర అటవీశాఖ మంత్రి కొండా సురేఖను మండల కేంద్రానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వెల్దే లక్ష్మణమూర్తి హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

రమ్య సుచరితకు డాక్టరేట్



నయీంనగర్: హనుమకొండ నగరానికి చెందిన ఇమ్మడి రమ్య సుచరిత డాక్టరేట్ అందుకున్నారు. చైతన్య డీమ్డ్ టు బీ యూనివర్సిటీలో రసాయన శాస్త్ర విభాగంలో ప్రొఫెసర్ నరసింహ ఆధ్వర్యంలో 'సింథసిస్ అండ్ బయాలజికల్ ఎవల్యూయేషన్ ఆఫ్ నోవెల్ ఫ్యూజ్డ్ 1,2,3 – ట్రయజోల్స్'పై సుచరిత పరిశోధన పూర్తి చేశారు. ఈ పరిశోధనలో యాంటీ క్యాన్సర్, యాంటీ బ్యాక్టీరియల్ అణువులను కనుగొన్నారు. ఈమేరకు ఆమెను యూనివర్సిటీ కులపతి సీహెచ్.పురుషోత్తం రెడ్డి, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సీహెచ్.సాత్విక్‌రెడ్డి, రిజిస్ట్రార్ రవీందర్, అధ్యాపకులు అభినందించారు.

నేడు అయ్యప్ప నగర సంకీర్తన

ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేటలో అయ్యప్ప సేవా పరపతి సంఘం ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం 6గంటలకు అయ్యప్ప నగర సంకీర్తన నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు కొల్లూరి యోగానంద్ గురుస్వామి తెలిపారు. ఈమేరకు వరంగల్ రంగశాయిపేట సీతారామచంద్ర స్వామి దేవాలయ ప్రాంగణంలో అయ్యప్ప సేవా పరపతి సంఘం సభ్యులతో కలిసి నగర సంకీర్తన, 23న అయ్యప్ప పడిపూజ కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యోగానంద్ మాట్లాడుతూ రంగశాయిపేట పురవీధుల్లో గురువారం సాయంత్రం 6గంటలకు అయ్యప్ప నగర సంకీర్తన నిర్వహించనున్నట్లు వివరించారు. 23న రంగశాయిపేట సీతారామ చంద్ర స్వామి ఆలయం ప్రాంగణంలో శబరిమలైని తలపించేలా అయ్యప్ప పడిపూజ నిర్వహించనున్నట్లు తెలిపారు. అయ్యప్ప మాలధారులు, భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

ఖిలా వరంగల్: వరంగల్ నగరంలో కాకతీయ రుద్రమాంబ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షురాలు బైరబోయిన సరోజన యాదవ్ ఆధ్వర్యంలో అనాథ వృద్ధులు, పేదలకు బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా నాయకుడు బస్వరాజ్ శ్రీమాన్ హాజరై సరోజన యాదవ్‌తో కలిసి దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో సింగారపు అరుణ, ధనలక్ష్మి, లక్ష్మి, అభిరామ్, జ్యోతి పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఫ్లెక్సీల చించివేత

కాశిబుగ్గ: వరంగల్ కాశిబుగ్గలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అభిమానులు, కాంగ్రెస్ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి చించివేశారు. ఈ విషయం తెలుసుకున్న నాయకులు.. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫ్లెక్సీలను చించివేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. స్థానిక బీఆర్‌ఎస్ నాయకులే ఈఘటనలకు పాల్పడి ఉంటారని, ఓటమిని భరించలేక కాంగ్రెస్ నాయకుల ఫ్లెక్సీలు చించివేశారని వారు ఆరోపించారు.

సీఎండీకి అభినందనలు

కాజీపేట అర్బన్: ఎన్పీడీసీఎల్ సీఎండీగా విద్యుత్‌భవన్‌లో బాధ్యతలు స్వీకరించిన కర్నాటి వరుణ్‌రెడ్డిని తెలంగాణ రాష్ట్ర యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ సీఐటీయూ అనుబంధ కంపెనీ నాయకులు బుధవారం కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.



ఏపుగా పెరిగిన నారు



ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్న రైతు



నాటు వేసిన పొలం

రబీ సాగుకు రైతన్నలు రెడీ



పొలంలో నాటు వేస్తున్న కూలీలు



గొర్రు కొడుతున్న రైతు

- ముమ్మరంగా వరినాట్లు
- మండల వ్యాప్తంగా 8,400 హెక్టార్లలో సాగు భూమి
- 3,200 హెక్టార్లలో వరిపంట సాగు
- యాసంగిలో మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారుల అంచనా

ఎల్కతుర్తి: మండలంలో రబీ సీజన్ పంట సాగుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో వరినాట్లు ముమ్మరంగా ప్రారంభమయ్యాయి. ఖరీఫ్‌లో సాగు చేసిన వరిపంట ఆశించిన స్థాయిలో దిగుబడి రావడంతో రైతులు ఆసక్తిగా రబీసాగుకు సమాయత్తమవుతున్నారు. గత నెలరోజుల క్రితం పోసిన వరినార్లు నాట్లు వేసేందుకు సిద్ధమయ్యాయి. రైతులు దుక్కులు దున్నే పనుల్లో నిమగ్నమయ్యారు. కొందరు రైతులు పొలాలను ఇప్పటికే సిద్ధం చేసి కూలీల సహాయంతో వరినాట్లు వేయిస్తున్నారు. దీంతో పలు గ్రామాల్లో వరినాట్లు ఊపందుకున్నాయి. ఎస్సారెస్పీ ఆయకట్టు కింది రైతులు నీటి విడుదల కోసం ఎదురు చూస్తున్నారు. నీటి విడుదలపై అధికారులు స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంతో పలువురు రైతులు ఆందోళనకు గురవుతున్నారు. నీటి విడుదల తేదీ ఖరారు చేసినట్లైతే మండలంలో మరింత సాగు విస్తీర్ణం పెరిగే అవకాశాలు ఉన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.

సాగు భూమి ఎంతంటే..

మండల పరిధిలో మొత్తం 19 గ్రామ పంచాయతీలకు మరో మూడు అనుబంధ గ్రామాలు ఉన్నాయి. వీటి పరిధిలో 8,400 హెక్టార్లలో సాగు భూములు ఉన్నాయి. ఇందులో 3,200హెక్టార్లలో రైతులు వరిపంటను సాగు చేస్తున్నారు. అయితే ప్రస్తుతం వ్యవసాయ బావులకింద రైతులు 2,100 హెక్టార్లలో వరిపంటను సాగుచేసే అవకాశాలు ఉన్నాయి. మరో 900 హెక్టార్లలో వరిసాగు విస్తీర్ణం పెరిగే అవకాశాలున్నాయని అధికారులు సూచన ప్రాయంగా వెల్లడిస్తున్నారు. కాగా రబీ సీజన్‌లో భూగర్భజలాలు అడుగంటి ప్రమాదం ఉండడం వలన పంటలు చేతికందే సమయంలో సాగునీరు అందుతుందో లేదోనని రైతులు అయోమయానికి గురవుతున్నారు. రబీ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎస్సారెస్పీ నీటి విడుదలపై అధికారులు ఏలాంటి ప్రకటనలు చేయకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. రైతుల పండించే పంటలపై అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి వహించి ఎస్సారెస్పీ నీటి విడుదలపై వెంటనే ప్రకటన చేయాలని రైతులు కోరుతున్నారు.

ఆరుతడి పంటలను సాగుచేసుకోవాలి



రబీసాగులో నీటి ఎద్దడిని దృష్టిలో పెట్టుకొని రైతులు వరిసాగుకు బదులుగా ఆరు తడి పంటల సాగుకు సన్నద్ధం కావాలి. వ్యవసాయ బావులకింద నీటిని అంచనా వేసుకొని దానికి తగిన విస్తీర్ణంలో పంటలు సాగు చేసుకోవాలి. నత్రజని శాతాన్ని తగ్గించుకోవడంతో పాటు సేంద్రియ ఎరువుల వాడకంపై దృష్టి సారించాలి.

– రాజ్‌కుమార్, ఏఓ, ఎల్కతుర్తి

ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయాలి



ఎస్సారెస్పీ కాలువ కింద ఉన్న పంట పొలాల్లో ఎక్కువగా వరి సాగుకే మొదటి ప్రధాన్యం ఇస్తాం. ప్రత్యామ్నాయ పంటలకు నేల అనుకూలం కాదు కాబట్టి వరిపంటనే ఎక్కవగా సాగు చేస్తున్నాం. నీటి సమస్య వస్తుందని భయమేస్తుంది. అధికారులు స్పందించి ఎస్సారెస్పీ నీటిని వెంటనే విడదల చేయాలి.

–నల్లాల శ్యాంసుందర్‌రెడ్డి, రైతు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



కమలాపూర్ : కరోనా వైరస్ మళ్లీ విజృంభిస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మాస్కులు, భౌతిక దూరం పాటించాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నాగరాజు సూచించారు. ఇతర దేశాలలో కరోనా మహమ్మారి మళ్లీ విజృంభిస్తుందని, మనదేశంలో కూడా ఢిల్లీ, ఉత్తర ప్రదేశ్, కేరళ వంటి రాష్ట్రాల్లో రోజురోజుకు కరోనా కేసులు పెరుగుతున్నాయని తెలిపారు. కరోనా వలన కేరళ రాష్ట్రంలో నలుగురు మృతి చెందారని, కరోనా లక్షణాలు ఉన్నట్లు అనుమానమస్తే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వచ్చి వైద్యులను సంప్రదించాలని ఆయన కోరారు.

శబరిమలకు పాదయాత్ర

మడికొండ: పాదయాత్ర ద్వారా శబరిమలలోని అయ్యప్ప స్వామిని దర్శించుకున్న రాంపూర్ గ్రామానికి చెందిన రాంచందర్ గురుస్వామిని పలువురు అయ్యప్ప మాలధారులు బుధవారం కలిశారు. ఈమేరకు ఆయనను పట్టు వస్త్రాలతో సత్కరించారు. రైలు మార్గం ద్వారా 1,600 కిలోమీటర్లు కాగా, పాదయాత్ర ద్వారా 2,400 కిలోమీటర్లు నడిచి అయ్యప్ప స్వామి దర్శనం చేసుకున్నట్లు రాంచందర్ వివరించారు. కార్యక్రమంలో శివశంకర్, దండిగం సతీష్, గురుస్వామి భాస్కర్ రెడ్డి, వెంకన్న, బాబు, శీలం రమేష్, హేమంత్, టీవీ.శ్రీను పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో అయ్యప్ప

కాజీపేట: కాజీపేట పట్టణంలోని హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో ప్రత్యేక అలంకరణ పూజలు నిర్వహించారు. మండల దీక్షలు చేపట్టిన మాలధారులు భజనలు చేశారు.

గొర్రెలకు బదులు నగదు బదిలీ చేయాలి



మాట్లాడుతున్న కాడబోయిన లింగయ్య

దామెర: గొర్రెలకు బదులు నగదు బదిలీ చేయాలని గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం(జీఎంపీఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి కాడబోయిన లింగయ్య బుధవారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో దామెర మండల కమిటీ విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2017లో గొల్ల, కురుమలందరికీ గొర్రెలను పంపిణీ చేస్తామని కొంతమందికి మాత్రమే పంపిణీ చేసి మిగితా వారికి ఇవ్వకుండా కాలయాపనచేస్తూ వచ్చిందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 1,117 మంది డీడీలు కట్టి రెండు సంవత్సరాలుగా ఎదురు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం చొరవచూపి నగదు బదిలీ ద్వారా గొర్రెల పంపిణీ చేయాలని వెల్లడించారు. జీఓ 559, 1016లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల రమేష్, మండల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నిక

గొర్రెల, మేకల సంఘం మండల కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా శ్రీనివాస్, పెంట రవి, మేరుగు శివ, మండల అధ్యక్షుడిగా మిరియాల రవి, ఉపాధ్యక్షుడిగా గాలి సత్యం, పెరుగు రవి, ప్రధాన కార్యదర్శిగా గాజు రాజు, సహాయకార్యదర్శులుగా బత్తిని రాజు, బైకని రాజు, గడల కొమురయ్య, కోశాధికారిగా ఎల్లబోయిన రాజు ఎన్నికయ్యారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



కమలాపూర్ : మండలంలోని గూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నెట్ బాల్ క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉమ్మడి వరంగల్ జిల్లా నెట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ ప్రకటనలో తెలిపారు. అండర్ 14 విభాగంలో కష్ణ శ్రీ, నికిత, సిద్ధు, సజన్, అభిరామ్, అండర్ 17 విభాగంలో శ్రీవల్లి, రక్షిత, నాగరాణిలు ఎంపికైనట్లు తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయురాలు తరంగిణి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు .

గుండెపోటుతో పంచాయతీ సెక్రటరీ మృతి



నివాళులర్పిస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ

ఐనవోలు: మండలంలోని పెరుమాండ్లగూడెంలో పంచాయతీ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న రాచర్ల సదానందం (52) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. ఎంపీడీఓ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. సదానందం మంగళవారం విధులకు హాజరై స్వగ్రామమైన ధర్మసాగర్ మండలం మలక్‌పల్లి గ్రామానికి వెళ్లాడు. సాయంత్రం వాంతులు చేసుకోగా గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లే క్రమంలో మార్గమధ్యలో గుండెపోటు రావడంతో అక్కడిక్కడే మృతి చెందినట్లు తెలిపారు. కాగా బుధవారం ఉదయం మృతుడి స్వగ్రామానికి వెళ్లిన ఎంపీడీఓ.. డిపార్ట్‌మెంట్ తరుపున దహన సంస్కార ఖర్చులకు రూ. 20వేలు అందజేసి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడికి భార్య స్వరూప, కుమారుడు స్వామి ఉన్నారు. ఎంపీపీ మార్నేని మధుమతి, ఎంపీఓ రఘుపతి, ఏపీఓ నక్క కుమారస్వామి, పెరుమాండ్లగూడెం సర్పంచ్ పిడుగు రజిత, మాజీ సర్పంచ్‌లు చందర్ రావు, స్వామి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.



సదానందం (ఫైల్)

ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూపించాలి

- ఆటో డ్రైవర్ల నిరసన



నిరసన ర్యాలీ చేపట్టిన ఆటో డ్రైవర్లు

పరకాల: ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం కారణంగా ఉపాధి కోల్పోయిన తమకు నెలకు రూ.15వేలు ఆర్థిక సాయం అందించాలని ఆటో డ్రైవర్లు డిమాండ్ చేశారు. మహిళలకు అందిస్తున్న ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని నిరసిస్తూ పట్టణంలో ఆటోలతో ర్యాలీ చేపట్టారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్ల సంఘం నాయకుడు ఎం.రాజు, దామ క్రాంతి, భాస్కర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిన మహాలక్ష్మి పథకం వలన తమ కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి నెలకొందన్నారు. ప్రజలకు ఉచిత సేవలు అందిస్తూ తమ పొట్టగొట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇలాగే ఉచిత సేవలు కొనసాగిస్తే తమకు ఆత్మహత్యలే శరణ్యమని ఆటో డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.డీ యాకుబ్ పాషా, చెర్రి, కుమార్, రమేష్, శ్రీనాథ్, రంజిత్, రవి, బాబు పాల్గొన్నారు.

ఎస్సై, ఎంపీడీఓకు అభినందనల వెల్లువ



దామెర: ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన కొంక అశోక్‌ను ఎమ్మార్పీఎస్ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గోవిందు రవికుమార్, నాయకులు గజ్జి మధు, దాసారపు నరేష్, గోవిందు కిరణ్, గోవిందు చంటి తదితరులు ఉన్నారు. అదే విధంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓ ఎం. వెంకటేశ్వర్‌రావును మండల కారోబార్లు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. నల్ల చిరంజీవి, మాదారపు బొబ్బిలి, దండ్రె దేవేందర్, గోవిందు ఆనంద్, నాగరాజు, మైల కుమారస్వామి, సర్వేశ్వర్ కలిసిన వారిలో ఉన్నారు.

ప్రతిష్ఠాపనను జయప్రదం చేయాలి



ఏర్పాట్లు పరిశీలిస్తున్న సీఐ మల్లేష్

దామెర: మండల కేంద్రంలోని పురాతన శివాలయం పునర్నిమాణంలో భాగంగా ఈ నెల 23న గర్భాలయద్వార ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ బిల్లా రమణారెడ్డి బుధవారం తెలిపారు. ఈ నెల 23న శుద్ధ ఏకాదశి ఉన్నందున ఉదయం 11.46 గంటలకు ద్వారప్రతిష్ఠాపన నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం అయ్యప్పస్వాముల ఆధ్వర్యంలో పంబారట్టు, మహాపడి పూజ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, శివ భక్తులు, గ్రామస్తులు, అయ్యప్ప స్వాములు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. కాగా ఏర్పాట్లను పరకాల రూరల్ సీఐ మల్లేష్, ఎస్సై కొంక అశోక్, సర్పంచ్ గురిజాల శ్రీరాంరెడ్డి, అయ్యప్ప స్వాములు రమేష్, సునీల్, సంపత్ పరిశీలించారు.

ప్రతిభకు పేదరికం అడ్డు కావొద్దు



విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎస్సై

శాయంపేట : విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభకు పేదరికం అడ్డుకావొద్దని ఎస్సై దేవేందర్ అన్నారు. జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికైన క్రీడాకారులకు ఆయన చేయూతనిచ్చారు. ప్రయాణ ఖర్చుల నిమిత్తం ఒక్కొక్క క్రీడాకారులకి రూ. 2000 చొప్పున ఆర్థిక సాయం అందించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సాయిశ్రుతి మహారాష్ట్రలోని పూణేలో జరుగనున్న జాతీయ స్థాయి రగ్బీ క్రీడా పోటీలకు, 9వ తరగతి చదువుతున్న లహరి ఈ నెల 25 నుంచి 29 వరకు బీహార్‌లో జరుగనున్న జాతీయ స్థాయి ఫుట్‌బాల్ క్రీడలకు ఎంపికయ్యారు. ఇరువురు క్రీడాకారులు పేద కుటుంబానికి చెందిన వారు కావడంతో విషయం తెలుసుకున్న ఎస్సై దేవేందర్ వారి ప్రయాణ ఖర్చుల కోసం ఒక్కొక్క క్రీడాకారులకు రూ. 2వేల చొప్పున 4వేల నగదు ఆర్థిక సాయం అందించారు. పీఈటీ కవిత, హెచ్‌ఎం శ్రీలతను ఎస్సై అభినందించారు.

జాతర పనుల పరిశీలన



ఆత్మకూరు : అగ్రంపహాడ్ సమ్మక్క సారలమ్మ జాతర ప్రాంగణాన్ని బుధవారం మండల అధికారులు పరిశీలించారు. జాతర పనుల ఏర్పాట్లపై సమీక్షించిన అనంతరం అమ్మవార్లను దర్శించుకున్నారు. తహసీల్దార్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ రవిరాజు, ఈఓ శేష గిరిరావు, తదితరులు ఉన్నారు.

పాఠశాలలను సందర్శించిన నోడల్ అధికారి



విద్యార్థులతో మాట్లాడుతున్న నోడల్ అధికారి

ధర్మసాగర్: మండలంలోని పెద్దపెండ్యాల జెడ్పీహెచ్‌ఎస్, ప్రాథమిక పాఠశాలలను నోడల్ అధికారి డాక్టర్ రాంధన్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో 6వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకు అమలు చేస్తున్న ఉన్నతి కార్యక్రమాన్ని, 10వ తరగతి లక్ష్యసాధన, ప్రాథమిక పాఠశాలలో అమలవుతున్న తొలిమెట్టు, గ్రామాల్లో నిర్వహిస్తున్న బడిబయట విద్యార్థుల గుర్తింపు తదితర కార్యక్రమాల గురించి అడిగితెలుసుకున్నారు. విద్యార్థుల్లో పఠన నైపుణ్యాన్ని సమర్థవంతంగా బోధించడానికి విద్యార్థుల స్థాయికి అనుగుణంగా బోధన చేయాలని టీచర్లకు సూచించారు. ప్రతిఒక్క విద్యార్థి చదువులో పోటీ పడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బత్తిని రాజేందర్, ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు రమాదేవి, ఎస్ ప్రభాకర్‌రెడ్డి, సీఆర్‌పీ రనూప, ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నర్సరీల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి



దామెర: నర్సరీల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాసరావు సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం నర్సరీల నిర్వహణపై సమావేశం ఏర్పాటు చేసి నర్సరీల్లో పెంచుతున్న మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. హరితహారంలో భాగంగా మొక్కలు నాటేందుకు నర్సరీల్లో సిద్ధం చేయాలని అన్నారు. గ్రామాల వారిగా ఇచ్చిన లక్ష్యం మేరకు మొక్కల పెంపకంపై చేపట్టాలన్నారు. అనంతరం నర్సరీల్లో బ్యాగ్ ఫిల్లింగ్, మొక్కలు నాటే విధానంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ ఇచ్చారు. ప్లాంటేషన్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకటేశ్వర్ రావు, ఏపీఓ శారద, టీఏలు పాల్గొన్నారు.

ఆడపిల్ల ఉంటేనే ఇంటికి వెలుగు



వేలేరు : ప్రతి ఇంటిలో ఆడపిల్ల ఉంటేనే ఆ ఇళ్లు వెలుగులతో విరజిల్లుతుందని ఐసీడీఎస్ సూజర్‌వైజర్ రమాదేవి అన్నారు. మండలంలోని బండతండా గ్రామ శివారు మాటుతండాలో బాలికల జన్మోత్సవం వేడుకలను ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. తల్లిదండ్రులు ఎవరు కూడా ఆడపిల్ల పుట్టిందని అధైర్య పడొద్దని అన్నారు. ఆడపిల్లను సంతోషంగా ఇంటికి ఆహ్వానించి వేడుకలు జరుపుకోవాలని సూచించారు. అనంతరం ఆడపిల్లల తల్లిదండ్రులను సన్మానించి, సమాజంలో వారి ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో సీడబ్ల్యూసీ మెంబర్ దామోదర్, ఐసీడీఎస్ సోషల్ వర్కర్ శ్రీనివాస్, డీహెచ్‌ఈడబ్ల్యూ జెండర్ స్పెషలిస్ట్ స్వర్ణలత, ఏఎస్సై భీమారెడ్డి, పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న ఎంపీడీఓ కృష్ణమూర్తి

శాయంపేట : రక్తదానం మరొకరికి ప్రాణదానంతో సమానమని ఎంపీడీఓ ఆమంచ కృష్ణమూర్తి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం పరకాల పీహెచ్‌సీ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించగా ఆయనతో పాటు టీఏ రామన్న, కంప్యూటర్ ఆపరేటర్ వినయ్, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు రక్తదానం చేశారు. ఏపీవో అనిత ఉన్నారు.